క్లుప్తంగా

శ్రీరాముడికి ప్రత్యేక పూజలు



గంధలేపన అలంకరణలో స్వామివారు

కర్నూలు కల్చరల్: పవిత్ర వైశాఖ బహుళ తృతీయ 'అక్షయ తృతీయ' పురస్కరించుకొని శరీన్ నగర్‌లోని సద్గురు త్యాగరాజ సీతారామాలయంలో శ్రీరామచంద్రమూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాభిషేకం, పంచామృతాభిషేకం, శ్రీరామచంద్రమూర్తి, శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి పూజా విగ్రహాలకు గంధలేపనంతో అలంకరించి అష్టోత్తర శతనామ పూజ, మహా మంగళ హారతి కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకులు మాళిగి భానుప్రకాష్ ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గర్భస్థ పిండ లింగనిర్ధారణ పరీక్షలు నేరం

కర్నూలు(హాస్పిటల్): గర్భస్థ పిండం లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమని, ఈ స్కానింగ్ చేసిన వారికి, చేయించుకున్న వారికి చట్ట ప్రకారం శిక్షలు తప్పవని జిల్లా సంచార చికిత్స కార్యక్రమ నోడల్ అధికారి డాక్టర్ రఘు చెప్పారు. బుధవారం కర్నూలు నగరంలోని రామ్ హెల్త్ క్లినిక్‌లో అల్ట్రాసౌండ్ స్కానింగ్ కేంద్రాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేసి రిజిస్ట్రేషన్, రెన్యువల్‌కు సంబంధించిన ధ్రువపత్రాలను పరిశీలించారు. అనంతరం స్కానింగ్ సెంటర్లలో మిషన్లు, స్కానింగ్ వివరాలు, వాటి వరుస సంఖ్య, తయారీ కంపెనీల పేర్లను సరిపోల్చి చూశారు. స్కానింగ్ చేయించుకున్న గర్భిణుల వివరాల రిజిస్టర్‌ను, లింగనిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని తెలిపే బోర్డులను ప్రదర్శిస్తున్నా అని పరిశీలించారు. స్కానింగ్ కేంద్రాలకు వచ్చే గర్భిణుల నుంచి పూర్తి సమాచారం తీసుకుని ఫార ం-ఎఫ్‌లో సంతకం, వివరాలను నమోదు చేయా లని తెలిపారు. ఫారం ఎఫ్ తప్పకుండా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని చెప్పారు. గైనకాలజిస్టు డాక్టర్ ఏక్తా రెడ్డి, ప్రాజెక్షనిస్టు డాక్టర్ ఖలీల్ వెంట ఉన్నారు.

ఉద్యోగులకు పదవీ విరమణ తప్పనిసరి



పదవీ విరమణ పొందిన శానిటరీ ఇన్‌స్పెక్టర్లను సత్కరించిన నగరపాలక అధికారులు

కర్నూలు (టౌన్): ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ తప్పనిసరి అని నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లుగా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన హరినాథ్, శ్రీనివాసులుకు బుధవారం రాత్రి స్థానిక నగరపాలక సంస్థ నూతన కౌన్సిల్ హాల్‌లో ఘనంగా ఆత్మీయ వీడ్కోలు సభ నిర్వహించారు. నగరపాలక సంస్థ అధికారులు వారికి శాలువాలు కప్పి, పూలదండలు వేసి సత్కరించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ల సేవలను కొనియాడారు. అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, మేనేజర్ చిన్నరాముడు, ఆర్‌ఓ ఇజ్రాయేల్, సూపరింటెండెంట్లు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్టు

గోనెగండ్ల: చిన్ననేలటూర్‌లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ విజయ భాస్కర్ తెలిపారు. సమాచారం మేరకు బుధవారం సాయంత్రం పోలీసులు చిన్న నేలటూర్ గ్రామంలో ఈడిగ నరసింహుడు ఇంటిలో తనిఖీ చేయగా.. 36 మద్యం బాటిళ్లు లభించడంతో కేసు నమోదు చేశామన్నారు. మండలంలో ఎవరైన అక్రమంగా మద్యం అమ్మితే చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో ఎవరైన మద్యం అమ్ముతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

పత్తికొండ రూరల్ : పత్తికొండ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు బుధవారం పట్టణ సమీపంలోని నాటుసారా స్థావరాలపై దాడులు చేశారు. మధు అనే వ్యక్తి నుంచి 10 లీటర్లు నాటుసారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ విశ్వేశ్వరరావు తెలిపారు. దాడుల్లో ఎస్ఐ ప్రసాద్, సిబ్బంది రాజేష్, తేజ్ ఉన్నారు.

కర్నూలు వ్యవసాయ మార్కెట్ ధరలు (క్వింటాల్‌కు రూ.లలో)

పంట	కనిష్ఠం	గరిష్ఠం
వేరుశెనగ	4,010	6,299
పొద్దుతిరుగుడు	4,829	4,829
ఆముదం	5,580	5,821
వాము	12,11	24,140
ఉల్లి	645	1,059
ఎండుమిర్చి	2,099	9,733
శనగలు	4,659	5,689
కందులు	3,200	6,696
మినుములు	3,211	8,196
కొర్రలు	1,679	2,811
సోయాచిక్కుడు	1,679	1,679
సజ్జలు	1,919	1,919


ఫోన్ నం : 08518-257204, 257661

పీఎం సూర్యఘర్ లక్ష్యాలు సాధించాలి

కర్నూలు కల్చరల్: జిల్లాలో పీఎం సూర్య ఘర్ పథకం అమలులో పురోగతి సాధించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. ఆయన బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో పీఎం సూర్య ఘర్, పీఎం కుసుమ్ పథకం అమలు, పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మోడల్ సోలార్ విలేజ్‌గా గుర్తించిన ఏడు గ్రామాల్లో సోలార్ రూఫ్ టాప్ ఇన్‌స్టాలేషన్‌లో పురోగతి తీసుకురావాలన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు పీఎం సూర్య ఘర్ పథకంపై అవగాహన కల్పించి సోలార్ రూఫ్ టాప్ ఇన్‌స్టాల్ చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సీఎం హామీ కింద పుచ్చకాయలమాడ గ్రామ పంచాయతీని ఎంపిక చేయడం జరిగిందన్నారు. సంబంధిత గ్రామాల్లో రిజిస్ట్రేషన్‌లు మాత్రమే చేస్తున్నారని, వాటిని తదుపరి దశకు తీసుకెళ్లడంలో పురోగతి లేదని అసహనం వ్యక్తం చేశారు. సోలార్ రూఫ్ టాప్ వినియోగంపై గ్రామాల్లో స్వయం సహాయక సంఘాల ద్వారా అవగాహన కల్పించాలన్నారు. సోలార్ ప్యానెల్స్ ఇన్‌స్టాల్‌కు సంబంధించి సబ్సిడీ వస్తుందని వివరించారు. పీఎం కుసుమ్‌కి సంబంధించి మే 8వ తేదీన టెండర్ పనులు పూర్తి కాగానే ఇన్‌స్టాలేషన్‌పై యాక్షన్ ప్లాన్ రూపొందించుకోవాలన్నారు. ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ ఉమాపతి, ఈఈ ఓబులేసు, డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి, మెప్మా పీడీ నాగశివలీల, తదితరులు పాల్గొన్నారు.



హాజరైన జిల్లా అధికారులు



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

రెడ్‌క్రాస్ సేవలు విస్తరించాలి

కర్నూలు(హాస్పిటల్): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సేవలను మరింత విస్తరించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా సూచించారు. ఆయన బుధవారం తన క్యాంపు కార్యాలయంలో రెడ్‌క్రాస్ సొసైటీ సమావేశం నిర్వహించారు. రెడ్‌క్రాస్ సొసైటీ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచే చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో పిల్లలకు ఫస్ట్ ఎయిడ్, సీపీఆర్ నేర్పించే చర్యలు తీసుకోవాలని, మెడికల్ క్యాంపులు నిర్వహించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు, పిడుగులు పడినప్పుడు బాధితులను ఆదుకునే చర్యలు చేపట్టాలన్నారు. అలాగే స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాలు చేపట్టాలని, అనాథ పిల్లలను ఆదుకునే చర్యలు, వారిని ఆదరించే ఏర్పాట్లు చేయాలని, పేద పిల్లలకు అవసరమైన స్కూల్ యూనిఫాంలు, షూస్, నోట్ పుస్తకాలు అందజేసే విధంగా చర్యలు తీసుకోవాలని సభ్యులకు సూచించారు. రాష్ట్రంలోనే మొట్టమొదటి స్కిన్ బ్యాంకు పూర్తి స్థాయిలో ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. తలసీమియా రోగులకు రక్తం, మందుల సరఫరా, బోన్ మ్యారో ట్రాన్స్ ప్లాంటేషన్‌కు అవసరమైన చర్యలు, జన ఔషధి దుకాణం ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేయాలన్నారు. ఈ అంశాలపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని చెప్పారు. రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కేజీ గోవిందరెడ్డి, సెక్రటరీ వెంకటకృష్ణ మాట్లాడుతూ.. రెడ్‌క్రాస్ తరపున రక్తదాన శిబిరాలు, కంటి శుక్లాలు, ఆర్గాన్ డొనేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రామచంద్రరావు, డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

సిల్వర్‌జూబ్లీ ప్రిన్సిపాల్‌కు ఘన సన్మానం

కర్నూలు సిటీ: సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న డాక్టర్ వీ.వీ.ఎస్ కుమార్ పదవీ విరమణ పొందారు. బుధవారం ఆ కాలేజీలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి రాయలసీమ యూనివర్సిటీ వీసీ, క్లస్టర్ యూనివర్సిటీ ఇంచార్జ్ వీసీ ఆచార్య వి.వెంకట బసవరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ బోధన, బోధనేతర సిబ్బంది హర్షించే విధంగా పరిపాలన సాగించి ఆదర్శ ప్రధాన ఆచార్యులుగా వీ.వీ.ఎస్ కుమార్ నిలిచారన్నారు. క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు, ఆర్‌యూ రిజిస్ట్రార్ బోయ విజయ్‌కుమార్, ప్రిన్సిపాల్ ఇందిరాశాంతి, వైస్ ప్రిన్సిపాల్ ప్రసాద్ రెడ్డితో పాటు పలువురు మాట్లాడారు. అనంతరం వీవీఎస్ కుమార్‌ను ఘనంగా సన్మానించారు. రిటైర్డ్ ప్రిన్సిపాల్ రమణయ్య, నాగరాజు, ఆయా కాలేజీల అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ వీవీఎస్ కుమార్ దంపతులను సన్మానిస్తున్న క్లస్టర్ వర్సిటీ వీసీ వెంకట బసవరావు, తదితరులు

మున్సిపల్ రెవెన్యూ ఆదాయం రూ.23.66 కోట్లు

- ముగిసిన పన్ను రాయితీ గడువు

కర్నూలు (టౌన్): ముందస్తు ఆస్తి పన్ను చెల్లింపుదారులకు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన 5 శాతం రాయితీ గడువు బుధవారం ముగిసింది. 2026-2027 ఆర్థిక సంవత్సరానికి ఆస్తి పన్ను చెల్లించే వారికి ప్రభుత్వం పన్ను రాయితీ అవకాశం కల్పించింది. ఈ నెలలో ఆస్తి పన్ను బకాయిలపై 50 శాతం వడ్డీ మాఫీ, ముందస్తు చెల్లింపుదారులకు 5 శాతం డిస్కౌంట్ అవకాశాలు కల్పించడంతో పలువురు పన్నుదారులు తమ ఇంటి పన్నులు చెల్లించారు. ఈ నెలలో రూ.23.66 కోట్ల ఆస్తి పన్ను వసూలైనట్లు నగరపాలక అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ వెల్లడించారు. మొండి బకాయిలకు సంబంధించి మార్కెట్ యార్డు సిబ్బంది రూ.29.12 లక్షల చెక్కు అందజేశారు. పన్నులు చెల్లించి నగర అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఓ జునీద్ పాల్గొన్నారు.



అదనపు కమిషనర్‌కు చెక్కును అందజేస్తున్న మార్కెట్ యార్డు సిబ్బంది

ఎన్‌సీడీ సర్వే పారదర్శకంగా నిర్వహించాలి

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో అసంక్రమిత వ్యాధుల (ఎన్‌సీడీ) సర్వే పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా సంచార చికిత్స కార్యక్రమ నోడల్ అధికారి డాక్టర్ రఘు ఆదేశించారు. ఆయన బుధవారం కర్నూలు మండలం సూదిరెడ్డిపల్లె గ్రామంలోని పాఠశాలలో నిర్వహిస్తున్న సంచార చికిత్స కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఎన్‌సీడీ సర్వేలో భాగంగా రక్తపోటు, షుగర్, క్యాన్సర్ తదితర వ్యాధి లక్షణాలను గుర్తించడంపై దృష్టి పెట్టాలన్నారు. ఎండలు పెరుగుతున్న దృష్ట్యా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు వడదెబ్బకు గురికాకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. ఎక్కువగా ద్రవపదార్థాలు, ఉప్పు కలిపిన మజ్జిగ, తాగు నీరు, ఓఆర్ఎస్ తీసుకోవాలన్నారు. ఆరోగ్య, ఆశా కార్యకర్తల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. వేసవి కాలంలో వడదెబ్బ తగలకుండా ప్రజలకు ముందస్తు జాగ్రత్తలు సూచించాలని తెలిపారు. వైద్యాధికారి డాక్టర్ అబ్దుల్ అసీద్, పీహెచ్ఎన్ హనుమంతమ్మ, నాగమణి, పర్యవేక్షకురాలు రెహనా, మాదమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



సంచార చికిత్స కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ రఘు

శ్రీశ్రీ సాహిత్యం అనన్య సామాన్యం



శ్రీశ్రీ చిత్రపటానికి పూల మాల వేస్తున్న ప్రిన్సిపాల్ ఆదినారాయణ రెడ్డి



శ్రీశ్రీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కవులు, రచయితలు, కళాకారులు


కర్నూలు కల్చరల్: శ్రీశ్రీ సాహిత్యం అనన్య సామాన్యమని, నిత్య నూతనమని పలువురు సాహితీ వేత్తలు, కవులు కొనియాడారు. టీజీవీ కళాక్షేత్రంలో బుధవారం శ్రీశ్రీ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా శ్రీశ్రీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. సాహిత్యంలో శ్రీశ్రీ విప్లవ కవిగా, సినీ రచయితగా సమాజాన్ని చైతన్య పరిచేలా ఎన్నో రచనలు చేశారన్నారు. భూస్వామ్య, పెట్టుబడిదారి విధానం పోవాలని, శ్రామిక, కార్మిక, కర్షక జీవన విధానం బలోపేతం చేసేందుకు కవిత్వం రాశారన్నారు. కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, కార్యదర్శి మహమ్మద్ మియ్యా, సభ్యులు బాలవెంకటేశ్వర్లు, ఈశ్వరయ్య, కరీముల్లా, శ్రీనివాసరెడ్డి, చంద్రకంటి మద్దయ్య, సాహితీవేత్తలు కెంగార మోహన్, బసవరాజు, తదితరులు పాల్గొన్నారు.

– దేవీ ప్రసన్న సాహితీ సంస్థ ఆధ్వర్యంలో మహా కవి శ్రీశ్రీ జయంతిని బుధవారం ఏక్యాంప్ మాంటిస్సోరి పాఠశాలలో నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ బి.వి.స్వరూప్ సిన్హా . తెలుగు కల్లం సాహితీ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ చిన్నావుల వేంకట రాజారెడ్డి, తెలుగు ఉపాధ్యాయులు పద్మావతి, ప్రతాపరెడ్డి తదితరులు శ్రీశ్రీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీశ్రీ కవిత్వాన్ని చదివి వినిపించారు. ఉపాధ్యాయులు లక్ష్మీకాంతరెడ్డి, నిరంజన్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీశ్రీ జయంతి

కర్నూలు సిటీ: ప్రభుత్వ బీఈడీ కాలేజీలో బుధవారం మహాకవి శ్రీరంగం శ్రీనివాసరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆదినారాయణ రెడ్డి పాల్గొని శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీశ్రీ మహాప్రస్థానం కవిత్వానికే కొత్త దారులు చూపించిందని, కష్టజీవులకు ఇరువైపుల నిలిచిన వాడే కవి అని లోకానికి చాటిందన్నారు. శ్రీశ్రీ ఆలోచనల వెంట అభ్యుదయ భావాలతో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. అధ్యాపకులు పార్వతీ దేవి, మధుసూదన్, నాగలక్ష్మీ, గోవిందరాజులు, కళ్యాణ్ కుమార్ ప్రసంగించారు.

ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు అమ్మొద్దు



పత్తికొండలో పోస్టర్స్ విడుదల చేస్తున్న అధికారులు, మెడికల్ షాపుల యాజమాన్యం

పత్తికొండ రూరల్ : ఎన్‌ఆర్‌ఎక్స్ డ్రగ్స్‌ని డాక్టర్ ప్రిస్క్రిప్షన్ పై మాత్రమే విక్రయించాలని ఈగల్ ఎస్ఐ కె.సృజన్‌కుమార్ సూచించారు. పట్టణంలోని కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో బుధవారం స్థానిక మెడికల్ షాపుల యజమానులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ కొన్ని దుకాణాల్లో ఎన్‌ఆర్‌ఎక్స్ మందులను డాక్టర్ల సలహాలు, చీటీలు లేకుండానే విక్రయిస్తున్నారని చెప్పారు. ఇది చాలా ప్రమాదకరమే కాకుండా చట్టరీత్యా నేరమన్నారు. ఎన్ఆర్ఎక్స్ డ్రగ్స్ వాడకం రోగుల ఆరోగ్యంపై తీవ్ర తీవ్ర దుష్ప్రభావాన్ని చూపుతాయన్నారు. క్రిమినల్ కేసులు కూడా ఎదుర్కోనాల్సి వస్తుందని స్పష్టం చేశారు. పత్తికొండ అర్బన్ సీఐ జయన్న మాట్లాడుతూ మెడికల్ షాపుల నిర్వాహకులు డ్రగ్స్ విక్రయాలకు సంబంధించి డాక్టర్ పేరు, ఎంసీఐ నంబర్‌తో కూడిన రికార్డు నమోదు చేయాలని చెప్పారు. అనంతరం ఈగల్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్‌లను విడుదల చేశారు. మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు సి.నాగరాజు, ఉపాధ్యక్షుడు నీలకంఠ పాల్గొన్నారు.

ముగిసిన పురాణ ప్రవచనం



పురాణ ప్రవచనం వినిపిస్తున్న సిద్ధరామయ్యస్వామి

హొళగుంద: స్థానిక శ్రీసిద్ధేశ్వరస్వామి ఆలయ ఆవరణలో జరుగుతున్న శ్రీకలబుర్గి శరణ బసవేశ్వరస్వామి మహా పురాణ ప్రవచనం బుధవారం ఘనంగా ముగిసింది. 21 రోజుల పాటు కల్బుర్గి శరణ బసవేశ్వరస్వామి జీవిత చరిత్రను ప్రవచనకారుడు సిద్ధరామయ్యస్వామి హిరేమఠ శాస్త్రీ భక్తులకు కథలు, గేయాల ద్వారా ప్రవచనాలను వినిపించారు. దాన ధర్మాలు, కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవడం వల్ల ఎంతో పుణ్యం లభిస్తుందని చెప్పారు. ఆలయ వంశ పారంపర్య ధర్మకర్తలు రాజ పంపన్నగౌడ్, శివశంకర్‌గౌడ్, సిద్ధార్థగౌడ్, సిద్దేశ్వరస్వామి సేవా సమితి ఆధ్వర్యంలో కార్యక్రమాలను చేపట్టారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ఘనంగా అక్షయ తృతీయ వేడుకలు



ప్రత్యేక అలంకరణలో రణమండల ఆంజనేయస్వామి

ఆదోని అర్బన్: అక్షయ తృతీయ సందర్భంగా బుధవారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేపట్టారు. స్థానిక రణమండల కొండలో వెలిసిన శ్రీ రణమండల ఆంజనేయస్వామికి ఫల పంచామృతాభిషేకం, గంధలేపన అలంకారం, తుల సీ పూలు, ఆకులు, మహామంగళహారతి, నైవే ద్యం తదితర పూజలు నిర్వహించారు. అలాగే పట్టణశివారులోని మంగరాయకాలనీలో వెలిసిన మంగరాయ ఆంజనేయ స్వామికి గంధలేపన అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి పంచామృతాభిషేకం, తేనాభిషేకం, గంధ లేపన అలంకారం, మహామంగళహారతి తదితర పూజలు నిర్వహించారు.

మానవత్వమే సమాజానికి మార్గదర్శకం



బసవేశ్వర చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహిస్తున్న వీరశైవులు



బసవన్న చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న సాహితీ వేత్తలు

కర్నూలు కల్చరల్: మానవత్వమే సమాజానికి మార్గదర్శకమని చాటి చెప్పిన విశ్వగురువు బసవన్న అని సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ అన్నారు. సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో బుధవారం సాంస్కృతిక విప్లవకారుడు బసవన్న అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 12వ శతాబ్దంలోనే కార్మిక వర్గం నా అస్తిత్వం అంటూ ప్రకటించిన గొప్ప మహోన్నతుడు బసవన్న అని అభివర్ణించారు. అందరూ సమానమే అని చాటి చెప్పిన దార్శనికుడన్నారు. అంతకుముందు బసవన్న చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల చక్రపాణి యాదవ్ అధ్యక్షతన జరిగిన సదస్సులో రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు, గౌరవాధ్యక్షుడు బసవరాజు, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, విరసం నాయకులు నాగేశ్వరాచారి, సత్యశోధక్ సమాజ్ నాయకులు ఉరుకుందు మాట్లాడారు. నంది అవార్డు గ్రహీత మహమ్మద్ మియ్యా, విరసం, సాహితీ సంస్థ నాయకులు విజయులు, సుల్తాన్ ఖాన్, కవి చౌశా, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బసవ జయంతి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు నగరంలోని శ్రీరామ థియేటర్ వద్ద ఉన్న సర్కిల్‌లో బసవేశ్వర స్వామి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కార్పొరేషన్ ఇటీవల నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆ కూడలిని బసవ సర్కిల్‌గా నామకరణం చేస్తూ తీర్మానించడం, రాష్ట్ర ప్రభుత్వం బసవేశ్వర జయంతిని అధికారికంగా నిర్వహించడం అభినందనీయమని వీరశైవ ఐక్య వేదిక నాయకులు తెలిపారు. బసవేశ్వరుడు సమానత్వానికి మార్గదర్శకుడని, శ్రద్ధ, శ్రమ, నిజాయితీతో జీవన మార్గం ఆయన సందేశాలన్నారు.

ఘనంగా మౌనేశ్వరస్వామి రథోత్సవం

హాలహర్వి: మండలంలోని నిట్రవట్టి గ్రామంలో బుధవారం సాయంత్రం మౌనేశ్వరస్వామి రథోత్సవం గ్రామపెద్దల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి జలాభిషేకం, కుంకుమార్చన, మహామంగళ హారతి తదితర విశేష పూజలు చేపట్టారు. భక్తులు బోనాలతో నైవేద్యాన్ని స్వామివారికి సమర్పించారు. సాయంత్రం భక్తుల జయజయ ధ్వానుల మధ్య రథాన్ని లాగారు. భక్తులకు ఆలయ ఆవరణలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చారు. గురువారం లంకాదహనం ఉంటుందని గ్రామపెద్దలు తెలిపారు.



భక్తుల మధ్య ముందుకు కదులుతున్న రథం

ఉపాధి కూలీ కుటుంబాన్ని ఆదుకోవాలి

పత్తికొండ రూరల్ : పాముకాటుకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కూలీ పింజరి కాశీం కుటుంబాన్ని ఆదుకోవాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బుధవారం ఎన్ఆర్ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ జిలాన్‌కు వినతి పత్రం అందించారు. సంఘం జిల్లా కార్యదర్శి నబిరసూల్, దూదేకొండ ఎంపీటీసీ ఈరన్న మాట్లాడుతూ కాశీం ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో నెలరోజులు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారన్నారు. జాబ్‌కార్డులో హాజరు వేసి, వైద్యం కోసం అయ్యే ఖర్చును అందించాలని కోరారు. చేతివృత్తిదారుల సమాఖ్య జిల్లా కార్యదర్శి కారన్న, నెట్టికంటయ్య, మాదన్న, భగవాన్, కారుమంచి పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌కు జైలుశిక్ష

ఆదోని రూరల్: మద్యం సేవించి ఆటో నడిపిన కల్లుబావికి చెందిన గొల్ల వీరేష్‌కు నెల జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చిందని పెద్దతుంబళం ఎస్ఐ మహేష్‌కుమార్ బుధవారం తెలిపారు. ఈనెల 22వ తేదీన డ్రంక్ డ్రైవ్‌లో పట్టుబడిన వీరేష్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచామన్నారు. విచారించిన న్యాయమూర్తి నెల రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

కల్లూరు: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని డీఎస్పీ మహబూబ్ బాషా, యూనిక్ ఇంగ్లిష్ స్కూల్ చైర్మన్ డాక్టర్ మౌలాన ఖాజి అబ్దుల్ మాజీద్ అన్నారు. స్థానిక అబ్బాస్ నగర్‌లోని యూనిక్ ఇంగ్లిష్ పాఠశాలలో పదో తరగతి పరీక్షలలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు బుధవారం ప్రశంసా పత్రాలు, బహుమతులు ప్రదానం చేశారు. పాఠశాల చైర్మన్ డాక్టర్ మౌలాన ఖాజీ అబ్దుల్ మాజీద్, డీఎస్పీ మహబూబ్ బాషా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పాఠశాల నుంచి ఆరుగురు విద్యార్థులు సోషల్‌స్టడీస్, తెలుగు సబ్జెక్టులలో వంద మార్కులు సాధించారని చైర్మన్ తెలిపారు. తమ విద్యార్థులు తహసీన్ 581 మార్కులు, సుఫిహా 570 మార్కులు, ఫైరోజ్ 560 మార్కులు సాధించారన్నారు. అలాగే 45 శాతం మంది విద్యార్థులు 500పైగా మార్కులు సాధించారన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్లూయిజ్ ఏర్పాటు చేయాలి

దేవనకొండ: మండలంలోని హంద్రీనీవా కాలువకు గుండ్లకొండ వద్ద స్లూయిజ్ ఏర్పాటు చేసి గ్రామాలకు సాగునీరు ఇచ్చి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోటకొండ సూరి కోరారు. బుధవారం బండపల్లి గ్రామంలో రైతులతో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ పాలకుల నిర్లక్ష్యంతో ఈ ప్రాంతానికి అన్యాయం జరుగుతోందన్నారు. నాయకులు మార్కండేయులు, కౌలుట్లయ్య, అస్లాంబాషా, శ్రీరాములు, ఆంజనేయులు పాల్గొన్నారు.